రంగరాజన్‌పై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న తిరువెంగళాచార్యులు

మన్సూరాబాద్‌: చిలుకూరు బాలజీ దేవాలయం ప్రధాన అర్చకుడిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర శ్రీవైష్ణవ సేవా సంఘం అధ్యక్షుడు శృంగారం తిరువెంగళా చార్యులు, ప్రధాన కార్యదర్శి సేవాపతి మోహన్‌ డిమాండ్‌ చేశారు. చంద్రపురి కాలనీలో సంఘం ప్రధాన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చిలుకూరి బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడి వెనుక ఉన్న కుట్రను ఛేదించి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. రామరాజ్యం అనే ముసుగులో రంగరాజన్‌ను నానా విధాలుగా వేధించి, నేలపై కూర్చోబెట్టి , దుర్భాషలాడుతూ వికృత చేష్టలకు పాల్పడడం హేయమైన చర్య అన్నారు. కొందరు నల్లని దుస్తులు వేసుకుని చెప్పులు, బూట్లు ధరించి ఇంట్లోకి ప్రవేశించి ఆయనపై దాడి చేయడాన్ని సభ్యసమాజం, సనాతన సాంప్రదాయపరులు క్షమించరని అన్నారు. ఈ సమావేశంలో సముద్రాల బద్రీనాథ్‌, న్యాయసలహాదారుడు వంగీపురం రత్న కుమార్‌ పాల్గొన్నారు.

దాడి హేయమైన చర్య..

హస్తినాపురం: రామరాజ్యస్థాపన చేయాలి అని చిలుకూరి బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై హైందవ ముసుగులో దాడిచేయడం హేయమైన చర్య అని ఎల్‌బీనగర్‌ నియోజకవర్గం బీజేపీ సీనియర్‌ నాయకులు పి.నరేశ్‌యాదవ్‌ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 20 మంది దుండగులు రంగరాజన్‌పై దాడిచేయడం అమానుషమని దీన్ని ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు.

దివ్యాంగుల పెళ్లికి చేయూత



పుస్తె, మెట్టెలు అందజేస్తున్న శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: అన్ని వర్గాల ప్రజలకు ఉప్పల ఫౌండేషన్‌ చేయూత అందిస్తుందని చైర్మన్‌ ఉప్పల శ్రీనివాస్‌ గుప్తా అన్నారు. వరంగల్‌కు చెందిన తెజవత్‌ బాలు, ఇస్లా గీతకు బోడుప్పల్‌ గుడ్‌ వే ఫౌండేషన్‌లో వివాహం జరుగుతున్నందున విషయం తెలుసుకుని వివాహానికి పుస్తె, మెట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రమణయ్య, గుడ్‌ వే ఫౌండేషన్‌ (వికలాంగుల సేవా సంస్థ) అధ్యక్షురాలు ఎరుపల్లి మంగమ్మ, ప్రధాన కార్యదర్శి షన్ముక రావు, కోటగిరి పాల్గొన్నారు.

డివిజన్ల అభివృద్ధికి సహకరించాలి

ఎల్‌బీనగర్‌: ఎల్‌బీనగర్‌ ప్రజలు చెల్లిస్తున్న ట్యాక్స్‌లను ఎల్‌బీనగర్‌ డివిజన్లకు కేటాయించి అభివృద్ధికి సహకరించాలని మన్సూరాబాద్‌ కార్పొరేటర్‌ కొప్పుల నర్సింహారెడ్డి సోమవారం జోనల్‌ కమిషనర్‌ హేమంత కేశవపాటిల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్‌ పరిధిలోని పలు కాలనీల అభివృద్ధికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. టెండర్‌ పూర్తయిన పనులకు వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరగా జోనల్‌ కమిషనర్‌ సానుకూలంగా స్పందించారన్నారు. అనంతరం నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఎల్‌బీనగర్‌ ప్రజలు చెల్లిస్తున్న ట్యాక్స్‌లకు అనుగుణంగా నియోజకవర్గానికి రూ.25కోట్లు నిధులు కేటాయిస్తున్నారని, ఇందులో భాగంగా వివిధ అభివృద్ధి పనులకు సుమారుగా రూ.2 కోట్లు నిధులను ప్రతి డివిజన్‌కు కేటాయించడం జరుగుతోందన్నారు.

అభివృద్ధి పనుల్లో భాగస్వాములు కావాలి


పనులకు శంకుస్థాపన చేస్తున్న మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్‌ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో స్థానికులు భాగస్వాములు కావాలని కార్పొరేటర్‌ వంగ మధుసూదన్‌ రెడ్డి అన్నారు. డివిజన్‌ పరిధి మారుతీనగర్‌ కాలనీలో రూ. 11.50 లక్షల నిధులతో చేపట్టనున్న తాగునీటి పైప్‌లైన్‌ విస్తరణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు రమేష్‌, శ్రీనివాసరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, నవీన్‌, శివకుమార్‌, మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు


స్వామివారి చిత్రపటంతో మల్‌రెడ్డి రాంరెడ్డి

చంపాపేట: రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్‌ చైర్మన్‌ మల్‌రెడ్డి రాంరెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా సోమవారం చంపాపేట డివిజన్‌ కర్మన్‌ఘాట్‌ ధ్యానాంజనేయ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా రాంరెడ్డిని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ మెగావత్‌ గణేష్‌ ఆధ్వర్యంలో గిరిజన సాంస్కృతి ప్రకారం ఆలయంలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో రాంరెడ్డిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌ కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు శ్రీపాల్‌ రెడ్డి, నాయకులు బేర బాలకిషన్‌, గణేష్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, కిరణ్‌, శివ, శ్రీధర్‌గౌడ్‌ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


నవీన్‌కుమార్‌

మలక్‌పేట: భార్యతో గొడవ పడి ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మలక్‌పేట పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సురేష్‌ వివరాల ప్రకారం.. మూసారంబాగ్‌ డివిజన్‌ సలీంనగర్‌ కాలనీలో తేరానగరి నవీన్‌కుమార్‌(35), భార్య మమత, ముగ్గురు పిల్లలతో కలిసి ఉంటున్నారు. శ్రీపురంకాలనీ విష్ణు రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తుండగా మమత కూరగాయలు విక్రయించేది. ఈనెల 7న కూరగాయలు అమ్మే చోటుకు వెళ్లి ఆమెతో గొడవ పడ్డాడు. సాయంత్రం భార్య ఇంటికి రాగా నవీన్‌ కుమార్‌ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మలక్‌పేట మార్కెట్‌లో సమస్యల తాండవం!

- ఆదాయం ఉన్నా కల్పించని సౌకర్యాలు
- అధ్వానంగా రోడ్లు, డ్రైనేజీ లైన్లు
- ఇబ్బందులు పడుతున్న రైతులు
- దృష్టి సారించని పాలకవర్గం, అధికారులు



చాదర్‌ఘాట్‌: రాష్ట్రంలోని అతిపెద్ద వ్యవసాయ మార్కెట్‌గా పేరుగాంచింది మలక్‌పేటలోని హైదరాబాద్‌ వ్యసాయ మార్కెట్‌. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి మిర్చి, ఉల్లి, చింతపండు, ధాన్యాలు ఈ మార్కెట్‌కు దిగుమతి అవుతాయి. వందల వాహనాలు రూ.కోట్లలో టర్నోవర్‌తో ఈ మార్కెట్‌ సందడిగా ఉంటుంది. ఇంత వరకు బాగానే ఉన్నా సమస్యలతో కొట్టుమిట్టులాడుతుంది. రోజుకు వందల లారీలు వివిధ జిల్లాల నుంచి మలక్‌పేట మార్కెట్‌కు వస్తుంటాయి. మార్కెట్‌ ప్రాంగణంలోకి రాగానే లారీలు కాంటా వేసుకొని లోపలికి రావాల్సి ఉంటుంది. అలాంటిది వే‌బ్రిడ్జ్‌ పనిచేయక బయట నుంచి తూకం వేసుకొని మార్కెట్‌ లోనికి ప్రవేశిస్తుంటారు. దీంతో మార్కెట్‌ ఆదాయానికి గండి పడుతుంది. అదే విధంగా బయట నుంచి వచ్చే తూకం కరెక్టా కాదా అనే సందేహాలు వ్యాపారుల్లో కలుగుతున్నాయి. అదే విధంగా మార్కెట్‌ లోపల లోడు వేసుకొని తూకం కోసం మూడు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోందటంతో వ్యాపారులు, రైతులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.


మార్కెట్‌లో పారుతున్న మురుగు

రోడ్లన్నీ గుంతలే..

సంవత్సరానికి రూ. 15 కోట్లు మార్కెట్‌కు ఆదాయ రూపేణా వస్తుంది. ఆదాయం సమృద్ధిగా ఉన్నా అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. గుంతలమయం, కంకర తేలి ఇటు వాహనాలు, మార్కెట్‌కు వచ్చే వినియోగదారులకు ఇబ్బందికరంగా మారింది. దీనిపై పాలకవర్గం దృష్టి సారించకపోవడంతో విమర్శలకు తావిస్తుంది. మార్కెట్‌ ఆదాయంలో 30 శాతం మేర పాలకవర్గం అభివృద్ధి కోసం ఖర్చు చేసే వెసులుబాటు ఉన్నా అభివృద్ధి జరగటం లేదని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


పనిచేయని కాంటా

ఏళ్ల తరబడి డ్రైనేజీ సమస్య

వర్షాకాలం వచ్చిందంటే మార్కెట్‌లోని రైతులు వ్యాపారులు, వినియోగదారుల ఇబ్బందులు వర్ణనాతీతం. దాదాపు మార్కెట్‌ ఏర్పడినప్పుడు ఉన్న డ్రైనేజీ లైన్లు నేటికీ అవే ఉండటంతో డ్రైనేజీ పొంగి కొన్ని సందర్భాల్లో మిర్చి, ఉల్లిగడ్డలు తడిసి రైతులు ఆందోళన చేసిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు వచ్చిన పాలకవర్గం డ్రైనేజీ సమస్యపై దృష్టి పెట్టి పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ప్రారంభానికి నోచుకోని విశ్రాంత గదులు

గత ప్రభుత్వం రైతులను దృష్టిలో ఉంచుకొని దాదాపు రూ. 30 లక్షలతో విశ్రాంతి గదులు ఏర్పాటు చేశారు. నేటి వరకు కూడా అవి అసంపూర్తిగానే ఉన్నాయి. హడావుడిగా ప్రారంభించి పనులు పూర్తి కాకుండానే వదిలేశారు. వాటిపై పాలకవర్గం, అధికారులు గానీ దృష్టి సారించకపోవడంతో విడ్డూరంగా ఉంది. రాత్రి వేళల్లో రైతులు మార్కెట్‌కు మిర్చి, ఉల్లిగడ్డలు తీసుకొని వస్తే ఉల్లిగడ్డల బస్తాల మీదనే కునుకు తీయాల్సి దుస్థితి నెలకొంటోంది.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం



మేం కొలువుదీరి మూడు నెలలు మాత్రమే కావస్తోంది. దశలవారీగా సమస్యల పరిష్కరానికి చర్యలు తీసుకుంటాం. రైతులను దృష్టిలో పెట్టుకొని సమస్యలు లేకుండా అధికారులను సమన్వయం చేస్తూ పాలకవర్గం ముందుకెళ్తుంది.

–సీహెచ్‌ లక్ష్మి, చైర్‌పర్సన్‌

రైతులకు సమస్యలు రానివ్వం..



మార్కెట్‌లో సమస్యలు ఉన్న మాట వాస్తవమేనని, అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. నూతనంగా ఏర్పడిన పాలకవర్గాన్ని సమన్వయం చేసుకొని ముందుకెళ్తూ, రైతులకు సమస్యలు లేకుండా చూస్తాం.

–దామోదర్‌, ఎస్‌జీఎస్‌

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్‌: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం 11కేవీ రాక్‌టౌన్‌ కాలనీ ఫీడర్‌ పరిధిలోని లలితానగర్‌, అయ్యప్పకాలనీ పరిసర ప్రాంతాల్లో ఉ.11 నుంచి మ. 1 గంట వరకు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్‌ డివిజనల్‌ ఇంజినీర్‌ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

మాజీ మేయర్‌కు సన్మానం



బడంగ్‌పేట్‌: కార్పొరేషన్‌ పరిధిలోని 31వ డివిజన్‌ సాయిబాలాజీ హోమ్స్‌–2 కాలనీలో కాలనీవాసులు సోమవారం ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మాజీ మేయర్‌ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి దంపతులను భారీ గజమాలతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అడిగిన వెంటనే కాలనీల్లో ఉన్న సమస్యలు పరిష్కరించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పారి జాత మాట్లాడుతూ.. 31వ డివిజన్‌లో కార్పొరేటర్‌గా తనను ఎన్నుకొని గెలిపించినందుకు కాలనీవాసులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా సంఘం వార్షికోత్సవం


వార్షికోత్సవంలో పాల్గొన్న మహిళలు

దిల్‌సుఖ్‌నగర్‌: మహిళలకు కేన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని డాక్టర్‌ సత్యశ్రీ అన్నారు. ఆర్‌కేపురం డివిజన్‌ శ్రీరామకృష్ణ పురం కాలనీ మహిళా సంఘం ప్రథమ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న డాక్టర్‌ సత్యశ్రీ మహిళలకు కేన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మధుర ఉపేందర్‌ రెడ్డి, అన్నపూర్ణ, రాధ, విజయలక్ష్మి, నీలిమ, శకుంతల, రాజేశ్రీ, స్వప్న, సురేఖ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

నాగోలు: యువజన సంఘాలు బస్తీ అభివృద్ధికి కృషి చేయాలని కొత్తపేట డివిజన్‌ మాజీ కార్పొరేటర్‌ వజీర్‌ ప్రకాష్‌గౌడ్‌, మాజీ మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ లింగాల నాగేశ్వరరావు సూచించారు. కొత్తపేట గ్రామ పెద్దల ఆధ్వర్యంలో కొత్తపేట ఎస్సీబస్తీ శివాజీ యూత్‌ అసోసియేషన్‌ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గట్టు మహేష్‌ కుమార్‌, ప్రధాన కార్యదర్శిగా మహేష్‌, కోశాధికారిగా సంపత్‌ ఎన్నుకున్నారు. మిగతా కార్యవర్గాన్ని తదుపరి సమావేశంలో ఎన్నుకుంటారని తీర్మానించారు. గ్రామస్తులు లింగాల రాహుల్‌గౌడ్‌, కిషోర్‌గౌడ్‌, కొమ్ము బాబు తదితరులు పాల్గొన్నారు.


నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న గ్రామ పెద్దలు

కార్పొరేషన్‌లో కబ్జాలను అరికట్టాలి

బీజేపీ మాజీ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

బడంగ్‌పేట్‌: కార్పొరేషన్‌ పరిధిలోని చాలా డివిజన్లలో ఓపెన్‌, పార్కు స్థలాలు అక్రమాలకు గురవుతున్నాయని ఎమ్మెల్యే స్పందించి కబ్జాలను అరికట్టాలని బీజేపీ కార్పొరేషన్‌ మాజీ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి డిమాండ్‌ చేశారు. నాదర్‌గుల్‌లోని పార్టీ కార్యాలయంలో వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక సమస్యలపై ఎమ్మెల్యే స్పందించాలని కోరారు. కోట్లు విలువచేసే స్థలాలు కొందరి అధికారులు అడ్డం పెట్టుకొని కాజేస్తున్నారన్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా ప్రభుత్వ అధికారులు స్పందించడం లేదన్నారు. కార్పొరేషన్‌లోని పలు డివిజన్‌లలో అభివృద్ధి పనులు అర్థంతరంగా ఆగిపోయాయన్నారు. ఎస్‌ఎన్‌డీపీ నాలా పనులు పెద్ద బావి మల్లారెడ్డి ఫంక్షన్‌హాల్‌ వద్ద ఇరిగేషన్‌ నాలా అక్రమాలకు గురై మధ్యలోనే ఆగిపోయిందన్నారు. కార్పొరేషన్‌లో నిధులు లేకపోయినా ఎజెండాలో పొందుపరిచి టెక్నికల్‌ పర్మిషన్‌ లేకపోయినా దొడ్డిదారిన గుత్తేదార్లు పనులు చేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే సబితారెడ్డి పట్టించుకొని బడంగ్‌పేట కార్పొరేషన్‌ను సరిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేషన్‌ 1, 2 అధ్యక్షులు రాళ్లగూడం రామకృష్ణారెడ్డి, రామిడి వీరకర్ణారెడ్డి తర్రి మల్లేశ్‌ తదితరులు ఉన్నారు.

ఇంటి పన్నులు తగ్గించాలని వినతి



మీర్‌పేట: ఇంటి పన్నులను తగ్గించాలని మీర్‌పేట కార్పొరేషన్‌ పరిధి జిల్లెలగూడలోని కాలనీల ప్రతినిధులు సోమవారం కమిషనర్‌ జ్ఞానేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీల ఫెడరేషన్‌ ప్రధాన కార్యదర్శి వంటేరు నర్సింహారెడ్డి, అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి ప్రజలు అధికంగా నివాసం ఉండే మీర్‌పేట ప్రాంతంలో అధిక ఇంటి పన్నులతో భారం పడుతోందన్నారు. జీహెచ్‌ఎంసీ, పక్కనే ఉన్న బడంగ్‌పేటలో అనుసరిస్తున్న మాదిరిగా వార్షిక అద్దె విలువ ప్రకారం ఇక్కడ కూడా పన్నులు విధించాలన్నారు. 36 కాలనీల ప్రతినిధులతో సమావేశమై పెంచిన ఇంటి పన్నులను తగ్గించాలని డిమాండ్‌ చేశారు.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

చంపాపేట: విద్యుత్‌ మరమ్మతు పనుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్‌ తెలిపారు. అంజిరెడ్డి కాలనీ 33/11 కేవీ విద్యుత్‌ ఫీడర్ల పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంజిరెడ్డి, పవన్‌పురి, విష్ణుపురి, ఉదయ్‌నగర్‌, ఈస్ట్‌ మారుతీనగర్‌, పద్మానగర్‌, ప్రెస్‌ కాలనీల్లో విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు.

విలువలతో కూడిన విద్యను అందించాలి

హస్తినాపురం: విలువలతో కూడిన విద్యను బోధించాలని భవిష్య విద్యాసంస్థ చైర్మన్‌ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హస్తినాపురంలోని దేవకమ్మతోటలోని భవిష్య పాఠశాల వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులను విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో రాణించేందుకు అన్ని విధాల కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌ రమ, అకాడమిక్‌ డైరెక్టర్‌ శాలిని, ప్రిన్సిపాల్స్‌ సాయి, సంతోష్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌ మమతారెడ్డి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి

చాదర్‌ఘాట్‌: కుటుంబ సమగ్ర సర్వేలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకొన్న సర్వే పూర్తయిందని మలక్‌పేట సర్కిల్‌–6 డీసీ జయంత్‌ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నెల రోజుల నుంచి జరుగుతున్న సర్వేలో 32 వేల దరఖాస్తులు పరిశీలించినట్లు ఆయన వెల్లడించారు.

ప్రజాపాలనలో సమస్యల వెల్లువ

ప్రజావాణి కార్యక్రమంలో పలు ఫిర్యాదు వచ్చాయని డీసీ జయంత్‌ తెలిపారు. ఓల్డ్‌మలక్‌పేట నుంచి ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు, అజంపురా డివిజన్‌ నుంచి మంచినీటి సరఫరాలో అంతరాయం, ఆస్తిపన్నుల పెంపుదల తదితర వాటిపై ఫిర్యాదులు వచ్చాయన్నారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న తోటి కానిస్టేబుళ్లు

నాగోలు: గత కొన్ని రోజుల క్రితం ఎల్‌బీనగర్‌ ట్రాఫిక్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో డ్యూటీ నిర్వహిస్తున్న కానిస్టేబుల్‌ శ్రీకాంత్‌ రోడ్డు ప్రమాదంలో రెండు చేతులు విరిగిపోయాయి. విషయం తెలుసుకున్న 2012 బ్యాచ్‌మెంట్స్‌ సోమవారం రూ. 52 వేల ఆర్థిక సాయం చేశారు.

పార్కు అభివృద్ధికి వినతి


వినతిపత్రం ఇస్తున్న సీతారాములు

ఎల్‌బీనగర్‌: మన్సూరాబాద్‌ డివిజన్‌ పరిధి కమలానగర్‌కాలనీలోని పార్కు స్థలాన్ని అభివృద్ధి చేయాలని మాజీ ఎమ్మెల్సీ సీతారాములు, కాలనీ సలహాదారులు వనం శాంతికుమార్‌తో కలిసి కమిషనర్‌ ఇలంబర్తికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. పార్కును అభివృద్ధి చేస్తే స్థానికులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. పార్కు అభివృద్ధికి కృషి చేస్తానని కమిషనర్‌ హామీ ఇచ్చారన్నారు.

డైనింగ్‌ టేబుళ్ల అందజేత


విద్యార్థులతో ఐడీబీఐ బ్యాంక్‌ అధికారులు

చాదర్‌ఘాట్‌: మలక్‌పేటలోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలకు ఐడీబీఐ బ్యాంక్‌ రీజనల్‌ మేనేజర్‌ సందీప్‌ పట్నాయక్‌, ఐడీబీఐ కాచిగూడ బ్రాంచ్‌ మేనేజర్‌ సుష్మా రామరాజు, ఆఫీసర్స్‌ భార్గవి, ఉదయ్‌కిరణ్‌ 10 డైనింగ్‌ టేబుళ్లను అందజేశారు. ఈ డైనింగ్‌ టేబుళ్లు తమ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని ప్రిన్సిపాల్‌ కె.నాగలక్ష్మి అన్నారు.

పాత నేరస్తుడి రిమాండ్‌


సైదులు

నాగోలు: బార్‌లోకి చొరబడి చోరీకి ప్రయత్నించిన పాత నేరస్తుడిని నాగోలు పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా, మట్టంపల్లికి చెందిన రమావత్‌ సైదులు(22) పాత నేరస్తుడు. హైదరాబాద్‌కు వచ్చి సాగర్‌రింగ్‌ రోడ్డు సమీపంలో ఫుట్‌పాత్‌పై నివాసముంటూ కూలీగా పనిచేస్తున్నాడు. ఈ నెల 9న రాత్రి నాగోలు వద్ద ఉన్న అమరావతి బార్‌లోకి ప్రవేశించేందుకు యత్నిస్తుండగా సెక్యూరిటీ గార్డు పట్టుకుంటుండగా తప్పించుకున్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా సైదులును గుర్తించి రిమాండ్‌ తరలించారు.


అమ్మవారి కల్యాణం జరిపిస్తున్న ఒగ్గు కళాకారులు


కల్యాణం వీక్షిస్తున్న భక్తులు

నేత్రపర్వం.. పెద్దమ్మ కల్యాణం

- కనుల పండువగా అమ్మవారి కల్యాణోత్సవం
- భక్తులతో కిక్కిరిసిన గరిగుట్ట ఆలయ ప్రాంగణం


బోనం ఊరేగింపులో భక్తులు

పహాడీషరీఫ్‌: జల్‌పల్లి మాదన్నగూడలోని గరిగుట్ట పెద్దమ్మ ఆలయం సోమవారం భక్త జనసంద్రంగా మారింది. అమ్మవారి కల్యాణ మహోత్సవం నేత్ర పర్వంగా కొనసాగింది. ఉత్సవాలు చివరి రోజు కావడంతో ఒగ్గు కళాకారులు ఆలయ ఆవరణలో సదరు పటాన్ని వేశారు. అనంతరం ఆలయ ధర్మకర్త కరన్‌కోట్‌ విఠల్‌బాబా పర్యవేక్షణలో అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు. శివ సత్తులకు ఆచారాల సమర్పణ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ సందర్భంగా జరిగిన అమ్మవారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. కల్యాణం అనంతరం విఠల్‌ బాబా అమ్మవారితో ఆలయంలో దాదాపు 50 మంది శివసత్తులతో కలిసి అగ్నిగుండాల ప్రవేశం చేశారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా మున్సిపల్‌ కమిషనర్‌ వెంకట్రామ్‌ పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు బుడుమాల యాదగిరి, పందెం కొండల్‌ యాదవ్‌, నాయకులు చింతకింది నవీన్‌గౌడ్‌, యంజాల శివకుమార్‌ తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని కల్యాణ మహోత్సవానికి తీసుకొస్తున్న విఠల్‌బాబా